


ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
సోమవారం | 13 అక్టోబరు , 2025 | పేజీలు : 06

# ఎస్ఆర్ ఎస్‌పి-2కు ఆర్‌డిఆర్ పేరుగా నామకరణం



24 గంటల్లో జిఓ జారీ చేస్తాం...

దామోదర్ రెడ్డి సేవలు చిరస్మరణీయం...

పార్టీ కోసం సర్వం కోల్పోయిన ఆయన కుటుంబానికి రాజకీయంగా అవకాశం ఇస్తాం...

తుంగతుర్తి సంతాప సభలో సిఎం రేవంత్‌రెడ్డి వెల్లడి

**ప్రజాపక్షం/సూర్యాపేట** : నాలుగు దశాబ్దాలుగా ప్రజలు, కాంగ్రెస్ పార్టీ కోసం మాజీ మంత్రి, పార్టీ సీనియర్ నాయకులు రాంరెడ్డి దామోదర్ రెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రైతు బిడ్డగా పుట్టిన దామోదర్ రెడ్డి వారి కష్టసుఖాలను ఎరిగి వారి సంక్షేమం కోసం శ్రీరాంసాగర్ రెండవ దశ ప్రాజెక్టు సాధన కోసం ఆయన చేసిన పోరాట ఫలితంగానే నేడు తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ నియోజక వర్గాలకు గోదావరి జలాలు కాల్వల్లో పారుతున్నాయని, దీంతో ఈ ప్రాంతం పచ్చని పంట పొలాలతో నేడు కలకలలాడుతుందన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితోపాటు శాసనసభ్యులందరి కోరిక మేరకు ఎస్ఆర్ఎస్‌పి 2 ప్రాజెక్టుకు ఆర్‌డిఆర్ (రాంరెడ్డి దామోదర్ రెడ్డి) పేరుగా నామకరణం చేస్తున్నామని ప్రకటించారు. 24 గంటల్లో దీనికి సంబంధించిన జిఓ జారీ చేస్తామని తెలిపారు. నేటి రోజుల్లో ఓ నాయకుడు ఒక్కసారి ప్రజాప్రతినిధి అయితేనే వేల కోట్ల రూపాయలు సంపాదించుకొని వెనకెసుకుంటున్నారని కానీ పార్టీ కోసం దామోదర్ రెడ్డి తన తల్లిదండ్రులు, అత్తగారి నుండి వచ్చిన వారసత్వంగా వచ్చిన తన స్థిర, చరాస్థులను పార్టీ కోసం తెగనమ్మి కార్యకర్తలను కంటికి రెప్పలాగా కాపాడుకున్న మహా నాయకుడని కొనియాడారు. ఆదివారం తుంగతుర్తి నియోజక వర్గ కేంద్రంలో నిర్వహించిన రాంరెడ్డి దామోదర్ రెడ్డి సంతాప సభకు మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితోపాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన శాసనసభ్యులతో కలిసి హాజరయ్యారు. దీనికి ముందు రాష్ట్ర డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, మాజీ మంత్రి, కాంగ్రెస్ నాయకులు కుందూరు జానారెడ్డిలు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ తుంగతుర్తి ప్రాంతం నీరు లేక ఏడారిగా కొద్ది రోజులలో మారిపోతుందని అధ్యాయనం చేసి వెల్లడించిందని చెప్పారు. భారతదేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ దీనిని దృష్టిలో ఉంచుకొని సాగు, విద్యాభివృద్ధి కోసం అధిక ప్రాధాన్యత ఇచ్చారని దీనిలో భాగంగానే శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణం జరిగిందని గుర్తు చేశారు. తాగు, సాగు నీరు లేక ఏడారిగా మారుతున్న తుంగతుర్తి ప్రాంతానికి గోదావరి జలాలు తీసుకవచ్చేందుకు శాసనసభ్యునిగా, రాష్ట్ర మంత్రిగా దామోదర్ రెడ్డి అనేక పోరాటాలు చేశారని చెప్పారు. చంద్రబాబు ప్రభుత్వంలో గోదావరి జలాల కోసం రక్తతర్పణం చేసి ఆనాటి ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా చేసి శ్రీరాంసాగర్ రెండవ దశ ప్రాజెక్టును సాధించిన ధీశాల అని కొనియాడారు. ప్రాజెక్టు నిర్మాణానికి అరకొర నిధులు కేటాయించి పనులు పూర్తి చేయకపోవడంతో రాష్ట్రంలో తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అధిక నిధులు కేటాయించేలా కృషి చేసి ప్రాజెక్ట్‌ను పూర్తి చేసి గోదావరి జలాలను కాలువల్లో పారించారని చెప్పారు. 1985లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కమ్యూనిస్టులకు కంచుకోటగా ఉన్న తుంగతుర్తి గడ్డపై ఎమ్మెల్యేగా పోటీచేసి కాంగ్రెస్ జెండాను రెపరెపలాడించారన్నారు. ఆయన పుట్టిన ఖమ్మం జిల్లా, ప్రాతినిధ్యం వహించిన తుంగతుర్తి, సూర్యాపేట నియోజక వర్గాలలో రాంరెడ్డి కుటుంబం కడవరకు పార్టీ అభివృద్ధి కోసం పాటుపడిందన్నారు. తాను ప్రాతినిధ్యం వహించిన తుంగతుర్తిని వీడి సూర్యాపేట నియోజక వర్గానికి వెళ్ళినా ఏనాడు తుంగతుర్తి ప్రాంతాన్ని మరువలేదన్నారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకోవడంతోనే గత అసెంబ్లీ ఎన్నికల్లో జేబులో రూ.50వేలు లేని మందుల సామేల్ 50వేల మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిచారని అన్నారు. దామోదర్ రెడ్డి వేసిన పార్టీ పునాదుల పైనే గెలువడం జరిగిందని చెప్పారు. నాలుగు దశాబ్ధాలుగా గాంధీ కుటుంబానికి రాంరెడ్డి కుటుంబానికి ఎంతో అనుబంధం ఉందన్నారు. అందుకే ఏఐసిసి సభ్యురాలు సోనియాగాంధీ, జాతీయ అధ్యక్షులు ఖర్గే, జాతీయ యువ నాయకులు రాహుల్ గాంధీ దామన్న మరణవార్త విని ఆయన కుమారునికి సంతాపం తెలిపారని అన్నారు. దామోదర్ రెడ్డి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్న విషయాన్ని తనతో చెప్పడం జరిగిందని సిఎం సభలో వెల్లడించారు. రాజకీయ పరంగా గాంధీ కుటుంబం దామోదర్ రెడ్డి కుమారుడు సర్వోత్తమ్ రెడ్డికి అవకాశం కల్పిస్తుందని తెలిపారు. చివరి శ్వాస ఉన్నంత వరకు కాంగ్రెస్ జెండాను వీడని దామోదర్ రెడ్డి కరుడుగట్టిన కాంగ్రెస్ వాదిగా ఉండడంతోనే ఈ ప్రాంత ప్రజలు ఆయనను ముద్దుగా టైగర్ దామన్న అని పిలుచుకుంటున్నారని చెప్పారు. డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర పౌరసరఫరాల, నీటిపారుదల శాఖల మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రోడ్లు భవనాలు, సినిఫోటోగ్రఫి శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, మాజీ మంత్రి, సీనియర్ నాయకులు కుందూరు జానారెడ్డి, ఎమ్మెల్సీలు శంకర్ నాయక్, అద్దంకి దయాకర్ తదితరులు తమ సంతాప సందేశాన్ని ఇచ్చారు. దామోదర్ రెడ్డితో వారికి ఉన్న అనుబంధాన్ని, పార్టీ కోసం చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బాలు నాయక్, వేముల వీరేశం, మట్ట రాఘవమహీ, డిప్యూటి స్పీకర్ డాక్టర్ రాంచందర్ నాయక్, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పోరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్ పాల్గొన్నారు.

## దొర పుట్టుకే అయినా దొరతనంతో ఏనాడు వ్యవహరించలేదు

పేదలతో రాంరెడ్డి కుటుంబానికి విడదీయరాని అనుబంధం : సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు

**ప్రజాపక్షం/తుంగతుర్తి** : పుట్టక దొరలే అయినా మాజీ మంత్రులు రాంరెడ్డి వెంకట్‌రెడ్డి, రాంరెడ్డి దామోదర్ రెడ్డిలు ఏనాడు దొరతనంతో వ్యవహరించలేదని పేదలతోనే వారి కుటుంబానికి మొదటి నుండి విడదీయరాని అనుబంధం ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. తుంగతుర్తి నియోజక వర్గ కేంద్రంలో ఆదివారం నిర్వహించిన మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి సంతాప సభకు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి హాజరయ్యారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దామోదర్ రెడ్డి కుమారుడు సర్వోత్తమ్ రెడ్డిని ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దామోదర్ రెడ్డి తమ ఖమ్మం జిల్లా బిడ్డనేనని అన్నారు. వారిది కాంగ్రెస్ వాదులైనా మేము కమ్యూనిస్టులమైనా తమ మధ్య అనుబంధం విడధీయరానిదని గుర్తు చేసుకున్నారు. సుజాత నగర్‌లో తన అన్న రాంరెడ్డి వెంకట్‌రెడ్డి కమ్యూనిస్టులపైనే నాలుగు సార్లు ఎమ్మెల్యేగా పోటీచేసి ఒక్కసారి గెలుపొందారని చెప్పారు. ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో వెంకట్‌రెడ్డి, దామోదర్ రెడ్డిలు ఢీకొన్నది కమ్యూనిస్టులతోనేనని అన్నారు. తనకు రాంరెడ్డి కుటుంబంతో వ్యక్తిగత సంబంధాలు ఉన్నాయని చెప్పిన ఆయన ప్రత్యక్ష ఎన్నికల్లో ఓడినా, గెలిచినా నిత్యం ప్రజల్లోనే ఉంటూ వారు జీవనం సాగించారని తెలిపారు. తన అన్న వెంకట్‌రెడ్డి మరణించగా పాత లింగాలకు తాను వెళ్ళగా ఆ ప్రాంత గిరిజనులతో వారికి ఉన్న సంబంధాలను చూసి ఆశ్చర్యపోయానన్నారు. పుట్టింది దొర పుట్టుక అయినా ఏనాడు వారు దొరల్లా వ్యవహరించకుండా పేదలకు అండగా నిలిచారని కొనియాడారు.

**గోదావరి జాలల సాధనకు పోరాడిన మహానాయకుడు : ఎమ్మెల్సీ నెల్లికంటి**

కరువు ప్రాంతాలైన తుంగతుర్తి, సూర్యాపేట ప్రాంతాల్లో గోదావరి జలాలను తీసుకవచ్చేందుకు సుదీర్ఘకాలం పోరాడిన మహానాయకుడు మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి అని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజాసమస్యల కోసం పోరాడిన దామోదర్ రెడ్డి మరణం భాదకరమన్నారు. 1985లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నుండి తుంగతుర్తి నియోజక వర్గంలో శాసనసభ్యునిగా గెలుపొందిన ఆయన ప్రజా నాయకుడిగా అంచెలంచెలుగా ఎదిగారన్నారు. ఐదు పర్యాయాలు శాసనసభ్యుడిగా, రెండు సార్లు మంత్రిగా పనిచేసి ప్రజల అభిమానాన్ని చూరగొన్నారని అన్నారు. దామోదర్ రెడ్డి కుమారుడు సర్వోత్తమ్ రెడ్డి ఆయన ఆశయ సాధన కోసం ముందుకు సాగాలని కోరారు.





## దామోదర్‌రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే రాగోపాల్‌రెడ్డి నివాళులు

**ప్రజాపక్షం/చండూరు:** మాజీ మంత్రి , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు స్వర్గీయ దామోదర్ రెడ్డి 10వ రోజు కార్యక్రమం ఆదివారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం శివారులో జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన మునుగోడు ఎంఎల్ఎ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి స్వర్గీయ రాంరెడ్డి దామోదర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరిమర్శించారు.

## సిడి పోస్టర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/చండూరు:** నల్లగొండ జిల్లా చండూరు మండలం కొండాపురం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్న ప్రముఖ కవి ,రచయిత,నవలాకారుడు ,సినీ గీతాల రచయిత భూతం ముత్యాలు రాసిన బడి పిల్లల పాట, సిటీ పొట్టి బాలలు సిడి పోస్టర్‌ను ఆదివారం తెలంగాణ పొరస్పందన వేదిక కవి విద్య అంతరాలు సమ్మేళనంలో మాజీ ఎంఎల్‌సి అలుగుబెల్లి నర్సిరెడ్డి ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పలువురు కవులు, కళాకారులు , రచయితలు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

**ప్రజాపక్షం/చండూరు:** గ్రామ పంచాయితీ ఉద్యోగ కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు చిన్నపాక లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం తెలంగాణ గ్రామ పంచాయితీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ చండూరు మండల మహాసభ బంగారిగడ్డ గ్రామంలో నాంపల్లి శంకరయ్య అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు చిన్నపాక లక్ష్మీనారాయణ హాజరై మాట్లాడుతూ ఈ నెల 18న కనగల్లు మండలంలో జరిగే జిల్లా మహాసభను,24,25 తేదీలలో మహబూబాబాద్ లో జరిగే రాష్ట్ర మహాసభల్లో కార్మికుల సమస్యలపై చర్చించి భవిష్యత్తు పోరాట కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య, మండల కన్వీనర్ జెర్రిపోతుల ధనుంజయ్య గౌడ్, యూనియన్ జిల్లా నాయకులు ఏర్పుల సైదులు ,రేవల్లి సైదులు పాల్గొన్నారు.



## స్మశానవాటికలో విద్యుత్ స్థంబాల ఏర్పాటు

**ప్రజాపక్షం/చండూరు:** మండల పరిధిలోని పుల్లెంల గ్రామం స్మశాన వాటికలో చీకటిపడితే చనిపోయిన వారిని ఖననం చేయడానికి ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు వడ్డగోని చంద్రశేఖర్ గౌడ్ స్థానిక ఎంఎల్ఎ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దృష్టికి తీసుకుపోవడంతో వెంటనే స్పందించిన ఎంఎల్ఎ రాజగోపాల్ రెడ్డి విద్యుత్ అధికారులతో మాట్లాడి స్మశాన వాటికలో విద్యుత్ స్థంబాలు వేయించి వాటికి వీధి లైట్లను అమర్చడం జరిగింది. వెంటనే స్పందించిన ఎంఎల్ఎ రాజగోపాల్‌రెడ్డికి పుల్లెంల గ్రామ ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలిపిన వారిలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వడ్డగోని చంద్రశేఖర్ గౌడ్, మాజీ ఎంపిటిసి సీత యాదయ్య, రాసాల వెంకన్న, ముక్కముల వెంకన్న, గండు కేషవులు , ఇరిగి వెంకన్న, పాలకూరి



బిక్షమయ్య, సీత మల్లయ్య, కనెగోని శంకర్ , బొడ్డు నరేష్ , గండు యాదయ్య, నీలకంఠం నరేష్ తదితరులు ఉన్నారు.

## మండలంలో ఎంపిపి, జెడ్‌పిటిసి పదవుల్లో అశావాహులు...



**ప్రజాపక్షం/చందంపేట:** నల్గొండ జిల్లా చందంపేట మండలం స్థానిక సంస్థల ఎన్నికల్లో చందంపేట మండలంలో ఎంపిపి, జెడ్పిటిసి పదవులు రెండు జనరల్‌కు రావడంతో ఆ పదవులకు ఆశావాహులు ఎక్కువయ్యారు. మండలంలో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు ఢీ అంటే ఢీ అనే విధంగా బలమైన నాయకులు ఉండడం, ఒకే గ్రామంలో ఒకే పార్టీలో ఇద్దరు బలమైన నాయకులు ఉండడంతో ఒకరికి ఇచ్చి మరోకరికి సీటు ఇవ్వకుంటే వేరే పార్టీలోకి వెళ్లే పరిస్థితులు ఉన్నాయని మండల నాయకులు గుసగుసలాడుకుంటున్నారు. ఎంపిపి, జెడ్పిటిసి పదవులు పాత నాయకులకే ఇవ్వాలని ఒకవర్గం నాయకులు అనుకుంటున్నారని, మండలంలో బిఆర్ఎస్ పార్టీ కూడా తగ్గేదేలేదు అన్న చందంగా ముందకు వెళుతున్నారని, అధికార పార్టీ బలంగా ఉన్నప్పటికి బరిలో ఉండే నాయకులను బట్టి బిఆర్ఎస్ పార్టీ వ్యూహాలు రచిస్తుందని తెలుస్తుంది. గతంలో మండలంలో మేమే అభివృద్ధి చేశామని మాకే అవకాశాలు ఉంటాయని బిఆర్ఎస్ నాయకులు చెబుతున్నా అధికార పార్టీ నాయకుల అందరు కలిసి ఎన్నికల్లో నిలబడతారా లేదా పదవులు దక్కక పక్కచూపులు చూస్తారా అని చూడాల్సుంది.

## యువత స్వయంకృషితో ఎదగాలి

**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** మండల కేంద్రంలోని యువకుడు శ్రీశైలం ఏర్పాటు చేసిన డయగ్నోస్టిక్ సెంటర్ ప్రారంభోత్సవానికి ఆదివారం ఆసరా స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక చైర్మన్ మేడి హరికృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా మేడి హరికృష్ణ మాట్లాడుతూ యువత స్వశక్తితో ఎదగాలని,ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూసి సమయాన్ని వృధా చేయకుండా స్వయం ఉపాధి అవకాశాలు కల్పించుకునేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం శ్రీశైలం కు శుభాకాంక్షలు తెలిపారు.



## రిజర్వేషన్ల సాధనకు జెండాలు, ఎజెండాలకతీతంగా ఏకం కావాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు బీసీ కులాలు, జెండాలు, ఎజెండాలకతీతంగా ఏకం




కావాల్సిన సమయం ఆసన్నమైందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలగాని వెంకటేష్ గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ రిజర్వేషన్ల సాధనకు ఈనెల 14న రాష్ట్ర బంద్‌కు 22 బీసీ సంఘాలు మద్దతు తెలిపాయని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లను అడ్డుకోవడం అంటే బీసీల ఎదుగుదలను అడ్డుకోవడమేనన్నారు. రిజర్వేషన్ల సాధనకు అన్ని రాజకీయ పార్టీలు తమ సంపూరవణ మద్దతు తెలిపాలన్నారు. పాలకులు అనాదిగా బీసీలను ఓట్లు వేసే యంత్రాలుగానే పరిగణిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర బంద్‌కు సకల జనులు సంపూర్ణ మద్దతు తెలిపాలన్నారు.

## సిఐటియు జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/ రామన్నపేట:** నవంబర్ 7, 8 తేదీల్లో రామన్నపేటలో జరిగే సీఐటీయూ జిల్లా 7వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం పిలుపునిచ్చారు. ఆదివారం గొరిగె సోములు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రామన్నపేటలో జరిగే జిల్లా మహాసభలకు కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వర్గాన్ని నూతన ఆర్థిక విధానాలతో అనునిత్యం శ్రమను దోచుకుంటూ దోపిడికి గురి చేస్తున్నాయని అన్నారు. శ్రమకు తగిన ఫలితం దక్కాలని కార్మికులను ఐక్యం నాగులు నూతన లేబర్ కోడ్లను రద్దు చేసి కార్మికుల సంక్షేమం కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు బొడ్డుపల్లి వెంకటేశం, బందెల భిక్షం, నకిరేకంటి రాము, వంగాల మారయ్య, బెక్కం జయమ్మ, వడ్లకొండ రమేష్ తదితరులు పాల్గొన్నారు.






## దామోదర్‌రెడ్డికి నివాళులర్పించిన మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

**ప్రజాపక్షం/తుంగతుర్తి :** మండల కేంద్రంలోని మిని స్టేడియంలో ఆదివారం నిర్వహించిన మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి సంతాప సభకు మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించి అనంతరం ఆయన కుమారుడు సర్వోత్తమ్ రెడ్డిని పరామర్శించారు. ఆయనతోపాటు మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్, మాజీ ఎంపి బడుగుల లింగయ్య యాదవ్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఒంటెద్దు నర్సింహరెడ్డి, బూడిద బిక్షమయ్య గౌడ్, చింతల వెంకటేశ్వర్‌రెడ్డి నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

## ఘనంగా పాస్టర్ల దినోత్సవం



**ప్రజాపక్షం/చివ్వెంల :** 2025 ప్రపంచ పాస్టర్ల దినోత్సవాన్ని ఆదివారం ఖాసీంపేట బేతెస్థ ప్రార్థన మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిషప్ దుర్గం ప్రభాకర్ మాట్లాడుతూ పాస్టర్స్‌డే ప్రతి సంవత్సరం అక్టోబర్ రెండవ ఆదివారం పాస్టర్ అప్రిసియేషన్‌డేగా జరుపుకుంటారన్నారు. ప్రపంచంలోని నాతోటి దైవజనులందరికి పాస్టర్స్‌డే శుభాకాంక్షలు తెలిపారు. సంఘ పెద్దలు మాట్లాడుతూ దేవుని పిలుపుకు లోబడి పరిచర్య ప్రారంభించి నిందలు, అవమానాలు భరించి ఆకలి దుఃఖము ముఖములో కనబడకుండా నిత్యము దేవుని రాజ్య సువార్తను ప్రకటిస్తూ గడుపుతున్న బిషప్ దుర్గం ప్రభాకర్ మహనీయుడని కొనియాడారు. ఈ సందర్భంగా బిషప్ దుర్గం ప్రభాకర్ హెప్సిబాతో పాటు పాస్టర్ మొరుగురి రూబెన్ కమలమ్మ, పాస్టర్ కొండేటి లాజర్ ఎస్తేరమ్మ, పాస్టర్ కొమ్ము హోసన్నా, పాస్టర్ బాణాల సైమన్ లకు శాలువాలు కప్పి, పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో యడవెల్లి యేసుపాదం, సురేష్, మిర్యాల కళింగరెడ్డి, పేతురు, బాబు, కిరణ్, సుధాకర్, భాస్కర్, జానయ్య పాల్గొన్నారు.

## ఎర్రజెండాను తుది వరకూ వదలని ముద్దుబిడ్డ ఏసోబు

**ప్రజాపక్షం/చివ్వెంల :** ఎర్రజెండాను తుది వరకు వదలక ముందుకు సాగుతూ తనువు చాలించిన ఎర్రజెండా ముద్దుబిడ్డ కామ్రేడ్ ఇట్టమల్ల ఏసోబు అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సిపిఎం సీనియర్ నాయకులు, చివ్వెంల తొలి ఎంపిపి ఇట్టమల్ల ఏసోబు కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఎం పార్టీ నాయకుడిగా పార్టీని నిలబెట్టడంలో విశేష కృషి చేశారన్నారు. శత్రువులు ఎన్ని బెదిరించిన ఎక్కడ జంకలేదని, ఎర్రజెండాతోనే ఉంటానని కట్టుబడిన ఆణిముత్యం అన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ ఈనాడు ఏసోబు మనతో లేకపోవడం చాలా విచారకరమన్నారు. అంతకుముందు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎండి అబ్బాస్, డిజి నర్సింగరావు, వెంకటేశ్వర్లు, యాదగిరిరావు, రాములు, సైదులు, గోపి, స్టాలిన్ పాల్గొన్నారు.





## పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా యనగందుల అశోక్

**ప్రజాపక్షం/తుంగతుర్తి** : తుంగతుర్తి మండలం గానుగుబండ గ్రామంలో పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్షులుగా యనగందుల అశోక్, ఉపాధ్యక్షుడిగా యనగందుల చిన్న అశోక్, ప్రధాన కార్యదర్శిగా యనగందుల కమలాకర్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు యనగందుల అశోక్ మాట్లాడుతూ సంఘానికి ఎంతో తోడ్పడి ఉంటానని అన్ని కార్యక్రమాలలో ముందుండి నడిపిస్తానని పద్మశాలి సంఘానికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు కోట రాజు, పద్మశాలి సంఘం పెద్దలు పద్మశాలి సంఘం కులస్తులు పాల్గొన్నారు.

## సుప్రీంకోర్టు వంకతో బిసిలను మరోసారి మోసం

**ప్రజాపక్షం/గుండాల;** మరోసారి బిసిలను మోసం చేయడానికి సిఎం రేవంత్‌రెడ్డి సిద్ధమైన బిసి రిజర్వేషన్లపై సుప్రీం కోర్టుకు వెళ్ళి కాలం వెళ్ళదీయాలని చూస్తున్నాడని ఆలేరు మాజీ ఎంఎల్‌ఏ బూడిద బిక్షమయ్యగౌడ్ ఎద్దేవా చేశారు. రిజర్వేషన్ల విషయంలో హైకోర్టు స్పష్టమైన విధంగా రిజర్వేషన్లు 50 శాతం మించకూడదని స్టే ఇచ్చిన నేపథ్యంలో సిఎం రేవంత్ రెడ్డి బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు సాధిస్తామని సుప్రీం కోర్టులకు వెళ్ళడం బిసిలను మోసం చేయడమే అని ఆయన అన్నారు. కాంగ్రెస్ చేస్తున్న కుట్రలను ఎండగట్టాలని బిసిలంతా ఏకం కావాలని ఆయన అన్నారు. బిసిలకు మద్దతుగా బిఆర్‌ఎస్ పార్టీ నిలబడుతుందని ప్రతి ఒక్క బిసి మేలుకోవాలని స్థానిక సంస్థలలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని, విద్యా, ఉద్యోగ, రాజకీయ అవకాశాలను కల్పించేంత వరకు బిసిలు ఎంతవరకైన పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## 14న బంద్‌కు సహకరించాలి

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్** : బిసిలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ ఇవ్వడంలో హైకోర్టు స్టే ఇవ్వడాన్ని నిరసిస్తూ ఈనెల 14వ తేదీన తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం హుజూర్‌నగర్ నియోజక వర్గ అధ్యక్షుడు దూళిపాళ శ్రీనివాస్, సిఐటియు నాయకులు ఎల్క సోమయ్య గౌడ్, బిఆర్‌ఎస్ నాయకులు ముల కలపల్లి రాంబాబులు కోరారు. ఆదివారం నియోజక వర్గ కేంద్రంలో బిసి ముఖ్యనేతలు, ప్రజా సంఘాల నాయకులతో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత 8 దశాబ్ధాలుగా బిసిలు సామాజి కంగా, రాజకీయంగా, విద్యాపరంగా, ఉపాధిపరంగా అణిచివేతకు గురవు తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాసంఘాల నాయ కులు రావినూతల ఇందిర, ఓరుగంటి మధుగౌడ్, ముత్యం నాగమణి, కర్నె కృష్ణ, వట్టికూటి శ్రీనివాస్ గౌడ్, శెట్టి శ్రీనివాస్, శివ, బ్రహ్మాచారి పాల్గొన్నారు.



# హామీలు అమలులో కాంగ్రెస్ విఫలం



**ప్రజాపక్షం/పెద్దఅడిశర్లపల్లి:** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలం అయ్యిందని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే,బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రామవత్ రవీంద్ర కుమార్ అన్నారు.ఆదివారం గుడిపల్లి మండలంలోని ఘణపురం గ్రామంలో పలువురు బిఆర్‌ఎస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ బిఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీలో చేరిన వారిలో ముఖ్యులు పరమేష్,మాధవరావు,కున్రెడ్డి రాజశేఖర్ రెడ్డి తో పాటు పలువురు బిఆర్‌ఎస్ లో చేరారు.చేరిన వారికి మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ గులాబీ కండవాలను కప్పి తమ పార్టీకి లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వల్లపు రెడ్డి మండల నాయకులుఅంజిరెడ్డి, నరసింహా, గోలిగిరి,ఎర్ర యాదగిరి,మహేందర్,సుధాకర్ గౌడ్,శ్రీను, విష్ణువర్ధన్ రెడ్డి,అనిల్ ఉన్నారు.

# కార్పొరేట్ వైద్యం అందించడమే మా లక్ష్యం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : చిన్నారులకు కార్పొరేట్ స్థాయి వైద్యం, అత్యాధునిక సదుపాయాలతో అందించడమే మా నెస్ట్ న్యూ బ్రాన్ చిల్డ్రన్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ మా లక్ష్యమని డాక్టర్ నితీష్, డాక్టర్ స్నేహ అన్నారు. ఆదివారం పట్టణంలోని డాక్టర్స్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన నెస్ట్ న్యూ బ్రాన్ చిల్డ్రన్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ను అనురాగ్ చిల్డ్రన్ హాస్పిటల్ డాక్టర్ సుధాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యాధునిక సదుపాయాలతో నిర్మించిన ఈ హాస్పిటల్లో నైపుణ్యం కలిగిన వైద్య సిబ్బందితో చిన్నారులకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్ స్థాయి చిన్న పిల్లల హాస్పిటల్ ను నల్లగొండలో ప్రారంభించడం ఎంతో శుభ పరిణామం అన్నారు. చిన్నారులకు ప్రత్యేక వైద్య సేవలు రక్త సేకరణ, స్కానింగ్, ఆక్సిజన్, బరువు పెంచడం వంటి అత్యాధునిక పరికరాలతో వైద్యం అందించి చిన్నారుల కు ప్రాణ రక్షణ కల్పించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని




జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఐఎంఏ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ పుల్లారావు మాట్లాడుతూ విదేశాల్లో వైద్యం అందించి హైదరాబాదులో ఉండకుండా నల్లగొండలో స్థిరపడి ఇక్కడే హాస్పిటల్ నిర్మించి పిల్లలకు వైద్య సేవలు అందించడం గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ మాజీ నీలగిరి అధ్యక్షులు డాక్టర్ అనిత రాణి, డాక్టర్లు రమేష్, సుబ్బారావు, నితీష్, విశ్వజ్యోతి, రాఘవేంద్ర రెడ్డి, కీర్తి, రవికుమార్, వీరారెడ్డి, ఐఎంఏ నీలగిరి డాక్టర్లు, పేరా మెడికల్ సిబ్బం ది, శశి ల్యాబ్ టెక్నీషియన్లు తదితరులు పాల్గొన్నారు.

# కేసులకు భయపడం : వేముల అశోక్




**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** బిజెపి కార్యకర్తలు, నాయకులు కేసులకు భయపడే రకం కాదని, గుర్తుపెట్టుకో ఉత్తమ్కుమార్ రెడ్డి అని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్ హెచ్చరించారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ఉట్కూరి అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మౌఖిక ఆదేశాలతోనే 12 మంది బీజేపీ నాయకులు, కార్యకర్తలపై కేసులు నమోదు చేశారని అన్నారు. ఈ అక్రమ కేసులను బిజెపి రాష్ట్ర శాఖ ఖండిస్తోందన్నారు. ఇరిగేషన్, పౌరసరఫరాల శాఖ మంత్రి కలెక్టరేట్‌కు వస్తున్న సందర్భంలో మదర్ డైరీ, ఐకెపి కేంద్రాల సమస్యలపై వినతిపత్రం అందజేయడానికి జిల్లా పార్టీ వెళ్లిందన్నారు. ఈ సమయంలో బిఎన్ తిమ్మాపూర్ రైతులు మంత్రిని కలవడానికి ప్రయత్నిస్తే బిజెపి జిల్లా కమిటీ మద్దతు ఇచ్చే ప్రయత్నంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి మహిళలను బిజెపి కార్యకర్తలను భయభ్రాంతులకు గురి చేశారన్నారు. ఐదుగురికి అనుమతి ఇచ్చిన అధికారులు వెంటనే కేసులు నమోదు చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగన్మోహన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు అచ్చయ్య, చందా మహేందర్, అప్పల యాదిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు పొన్నాల శేఖర్ రెడ్డి, వేముల నరేష్, జిల్లా సెక్రటరీలు కామిటికారి కృష్ణ, వైజయంతి, లక్ష్మీ నారాయణ, పట్టణ అధ్యక్షులు బలరాం భువనగిరి మండల అధ్యక్షులు చీరిక సురేష్ రెడ్డి పాల్గొన్నారు.

# శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్‌కు దామన్న పేరు పెట్టడం హర్షణీయం

**ప్రజాపక్షం/భువనగిరిరూరల్** : మాజీ మంత్రి వర్యులు, రాంరెడ్డి దామోదర్ రెడ్డి మృతి రాష్ట్ర ప్రజలకు, ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలకు కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని కాంగ్రెస్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ పరిశీలకుడు పోత్నక్ ప్రమోద్ కుమార్ అన్నారు. భువనగిరి జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డులో మాజీ కౌన్సిలర్ రాచమల్ల రమేష్ అధ్యక్షతన సంతాప సభ నిర్వహించారు. ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ రెండు సార్లు మంత్రిగా, 5 సార్లు శాసనసభ్యుడిగా, యువజన కాంగ్రెస్ నాయకునికా పిసిసి ఉపాధ్యక్షులుగా ఏఐసిసి సభ్యునిగా అనేక ఎన్నికల్లో పార్టీ ఇంచార్జీగా పని



చేసిన వ్యక్తి దామన్న అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఎస్సీ విభాగం అధ్యక్షులు దర్గాయి హరిప్రసాద్, సీనియర్ నాయకులు డి.రాములు, భువనగిరి పార్లమెంట్ కో ఆర్డినేటర్ ఎండి అతహర్, వర్తక సంఘం అధ్యక్షులు మంచికంటి కృష్ణమూర్తి, యువజన నాయకుడు బింగి నరేష్, జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షులు నాకోటి రాము పాల్గొన్నారు.



## సుమిత్రభాయ్ ఆశయాలను సాధించాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** సుమిత్రభాయ్ ఆశయాలను సాధించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్, ఎండి.అబ్బాస్, డీజే నరసింహారావులు అన్నారు. ఆదివారం బృందావన్‌గార్డెన్‌లో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్ సతీమణి సుమిత్రభాయ్ సంతాప సభ నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమిత్ర మృతికి పార్టీకి తీరని లోటని అన్నారు. నివాళులర్పించిన వారిలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నున్నా నాగేశ్వర్‌రావు, ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, డబ్బికార్ మల్లేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సయ్యద్ మాసం, కందాల ప్రమీల, వీరేపల్లి వెంకటేశ్వర్లు, మల్లు గౌతంరెడ్డి, పాండు, అయూబ్, పరుశురాములు, వినోద్‌నాయక్, శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇష్టానుసారంగా బెల్ట్ షాపులు

### ...పట్టించుకోని అధికారులు

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంతో పాటు మండల వ్యాప్తంగా ఇష్టానుసారంగా జనవాసాల మధ్య బెల్ట్ షాపులను నిర్వహిస్తూ సామాన్య ప్రజలను ఇబ్బందులుకు గురిచేస్తున్నా ఎక్సైజ్ అధికారులు మాత్రం తెలిసి తెలియనట్లుగా వ్యవహరిస్తున్న పరిస్థితి. జనవాసాల మధ్య నిర్వహిస్తున్న బెల్ట్ షాపుల మూలంగా ఇండ్లలోనుండి మహిళలు, పిల్లలు బయటకు వెళ్ళాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సిన వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మందుబాబులు మద్యం మత్తులో ప్రతి రోజు గొడవలు పడుతుండడంతో ఇండ్ల నుండి బయటికి రాలేని పరిస్థితి నెలకొంది. ఇంత జరుగుతున్నా ఎక్సైజ్ అధికారులు తమకేమి తెలియదన్నట్లుగా చూసి చూడనట్లు మాములమత్తులో ఉండడంతో ప్రజలు తీవ్ర అగ్రహాం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జనావాసాల మధ్య ఉన్న బెల్ట్ షాపులను తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## బిసి హక్కుల మీద కేసులు వేయడం ధర్మమేన?

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** 42 శాతం బీసీలకు రిజర్వేషన్ అనగానే 50శాతం రిజర్వేషన్ మించోదు అంటున్నారని 2019లో ఓసిల కోసం ఈ డబ్ల్యూఎస్ రిజర్వేషన్ ఎలా పెంచారని రాష్ట్ర స్పోర్ట్స్ కోట పోరాట సాధకులు రాచకొండ రమేష్ గౌడ్ ప్రశ్నించారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలు నైతిక హక్కుల కోసం పోరాడే స్వేచ్ఛ లేదా 42 అనేది మా యెక్క పూర్తి హక్కు అవసరం అన్నారు. అయితే మా జనాభా ప్రకారం 50 పైన ఇవ్వాలి ఈడబ్ల్యూఎస్ మీద మేము ఎప్పుడూ కేసు వేయలేదని మా బీసీల హక్కుల మీద కేసులు ఎందుకు వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ హక్కులు సాధించేవరకు మా పోరాటం ఆగదని హెచ్చరించారు.

## మాజీ ఎంపిపి నరేందర్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు

**ప్రజాపక్షం/నార్కెట్ పల్లి:** మాజీ ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్ రెడ్డి పుట్టినరోజును పునస్కరించుకుని నిరుపేదలకు,నిస్సహాయులకు బిక్షటన చేసేవారికి 100మంది అన్నదానం కార్యక్రమం ఆదివారం సూదిరెడ్డి అభిమానులు నిర్వహించారు. ఈ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూ సూదిరెడ్డి నరేందర్ రెడ్డి ఎంపీపీ గా పదవి కాలంలో నిరుపేదలకు ఎన్నో మంచి పనులు చేశారు. మనం స్వచ్ఛంద సంస్థలో అన్నదానం జరిపించటం చాలా సంతోషంగా ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో చిట్యాల రవిచంద్ర, వడ్డేపల్లి నాగరాజు, ఎస్ కే జానీ భాషపాక, పెరమళ్ళ రవి మల్లేష్, జిట్టా శంకర్,మంద రవి, లింగస్వామి పాల్గొన్నారు.



# నూతన జాతీయ విద్యా విధానం రద్దుకై ఉద్యమిద్దాం




**- ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు దండి సురేష్**
**- ఏదులాపురంలో ఘనంగా ఏఐఎస్ఎఫ్‌శాఖ మహాసభ**

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** నూతన జాతీయ విద్యా విధానం రద్దుకై విద్యార్థులు ఉద్యమించాలని, ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ పిలుపునిచ్చారు. ఆదివారం ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని ఏదులాపురంలో ఏఐఎస్ఎఫ్ శాఖ మహాసభను నిర్వహించారు. తొలుత ప్రాంగాణంలో ఏర్పాటు చేసిన ఏఐఎస్ఎఫ్ శ్వేత అరుణ పతాకాన్ని దండి సురేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఓరుగంటి మృదుల అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు...నూతన విద్యావిధానం పేరుతో యూనివర్శిటీల స్వయం ప్రతిపత్తి దెబ్బతీసే ప్రయత్నం జరుగుతుందన్నారు. ఇలా చేయడం ద్వారా యూనివర్శిటీలను 3,4 రకాలుగా విభజన చేసి విద్యను కార్పొరేటికరణ, ప్రైవేటికరణ, కమర్షలైజేషన్, కాషాయికరణ చేయబోతున్నట్లు తెలిపారు. ఈ విధానాలు ప్రభుత్వ విద్య వ్యవస్థను ధ్వంసం చేయడానికి తీసుకుంటున్న చర్యలని ధ్వజమెత్తారు. ప్రధానంగా బీజేపీ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ ఎజెండాను అమలు కోసం ఈ కుట్రలన్ని పన్నుతుందని ఆరోపించారు. ప్రధానంగా ప్రధాని మోదీ దేశానికి అత్యంత ప్రమాదకరంగా పరిగనిస్తున్నారన్నారు. ఏఐఎస్ఎఫ్గా వీటిని ఖండించి, విద్యార్థులను చైతన్య పరచాలని సూచించారు. అనంతరం 23మంది నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా నాయకులు మిడకంటి వెంకటరెడ్డి, వెంపటి సురేందర్, ఏఐవైఎఫ్ జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికల రామకృష్ణ, సభ్యులు షేక్ నాగుల్ మీరా, మధు, వంశీ, మనోజ్, దండి శ్రీజ, మిడకంటి అభిరామ్, వెన్న బోయిన అజయ్, సాగర్, పటాన్ రఫీ, మురళి, అకీల్, ప్రదీప్, సిపిఐ నాయకులు దొంతగాని వెంకన్న, ఉపేందర్, మేళ్లచెర్వు రవి, మామిడాల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# నిబద్ధత గల కమ్యూనిస్టు వెంకట్రావమ్మ



**సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల**

**ప్రజాపక్షం/చింతకాని :** బతికినంత కాలం నిబద్ధత గల కమ్యూనిస్టు గా అయ్యదేవర వెంకట్రావమ్మ బ్రతికిందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి పేర్కొన్నారు. సిపిఐ సీనియర్ కార్యకర్త అమర జీవి అయ్యదేవర వెంకట్రావమ్మ(95) ఆదివారం తెల్లవారుజామున మృతిచెందింది. విషయం తెలుసుకున్న సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి కొదుమూరు చేరుకుని వెంకట్రావమ్మ మృతదేహంపై పార్టీ జెండా ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జమ్ముల మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ కోసం వీరమరణం పొందిన అయ్యదేవర పుల్లయ్య మాతృమూర్తి వెంకట్రావమ్మ కావడం గర్వకారణమన్నారు. తనతో పాటు కుమారులందరినీ కమ్యూనిస్టు పార్టీ నిబద్ధత గల కార్యకర్తలుగా తీర్చిదిద్దడం గొప్పతనమన్నారు. నివాళులర్పించిన వారిలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కూచిపూడి రవి, జిల్లా సమితి సభ్యులు నారపోగు హేమ నాగార్జున, మాజీ సర్పంచ్ నక్కనబోయిన సుజాత కృష్ణ, శాఖ కార్యదర్శి నీరుడు గోవిందరావు, మాజీ కార్యదర్శి చిట్టిమెదు కొండలరావు,నాయకులు బోయిన రవి, నక్కనబోయిన లింగయ్య, నారపోగు శ్రీను, కుటుంబ సభ్యులు అయ్యదేవర ఎర్రయ్య, రవి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# 14న జరిగే రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయండి



**జాతీయ బిసి సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్**

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికలలో 42% రిజర్వేషన్ అమలు చేయాలని ఇటీవలనే కాంగ్రెస్ పార్టీ జీవో నెంబర్ 9 ని తీసుకురాగా దానిపై హైకోర్టు స్టే ఇవ్వటాన్ని నిరసిస్తూ ఈ నెల 14న జాతీయ బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా బంద్ ప్రకటించడం జరిగిందని, సత్తుపల్లి నియోజకవర్గంలో పలు రాజకీయ పార్టీలు,కుల సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగే బంద్ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు నారాయణవరపు శ్రీనివాస్. ఆదివారం సత్తుపల్లి నియోజకవర్గ జాతీయ బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో పలు పార్టీలు, కుల సంఘాల నాయకులతో జరిగిన సమావేశంలో నారాయణవరపు శ్రీనివాస్ సమావేశమయ్యారు. ఈ సమావేశంలో కమ్యూనిస్టు నాయకులు దండు ఆదినారాయణ, సర్వేశ్వరరావులు మాట్లాడుతూ 14న జరిగే బంద్ కార్యక్రమానికి పెద్ద ఎత్తున బీసీ రిజర్వేషన్ల మద్దతుదారులు హాజరై జయప్రదం చేయాలన్నారు.ఈ సమావేశానికి కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం, జనసేన, మాల మహానాడు, ఎమ్మార్పీఎస్, మైనారిటీ లకు సంబంధించిన పలు సంఘాలు నాయకులు పాల్గొన్నారు.

# గండగలపాడు పల్లె దవాఖానలో పారిశుధ్యం అస్తవ్యస్తం



**-దవాఖానకొస్తే రోగాలు పోవడమేమోగాని కొత్త రోగాలొస్తాయని భయపడుతున్నరోగులు**



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు గండగలపాడులోని పల్లె ప్రాంగణం అస్తవ్యస్తంగా ఉంది. ఈ పల్లె దవాఖానాలో వైద్యులు ఆరోగ్య సేవలు అందిస్తున్నారు అందే నమ్మకస్తం కాని విధంగా ఉంది. ఎందుకంటే పల్లె దవాఖానా హాస్పిటల్ ప్రాంగణం మొత్తం పిచ్చి మొక్కలతో బావి చుట్టూ బురద నీరుతో దర్శనమిస్తున్నాయి. హాస్పిటల్‌కి వచ్చిన వైద్యులు హాస్పిటల్ పరిస్థితిని కూడా పట్టించుకోవాలి కదా..రోగాల నివారణ కోసం పెట్టిన పల్లె దవాఖానాకి వస్తే రోగాలు వచ్చేటట్లు కనిపిస్తూ ఉంది. అసలే అంతంత మాత్రాన వైద్యసేవలు అందుతూ ఉన్నాయి. వైద్యులు ఎప్పుడు వస్తారో కూడా ఎప్పుడు పోతారు కూడా తెలియని పరిస్థితి. పారిశుధ్యం పట్ల నిర్లక్ష్యంగా ఉన్నారు. అదే మీ ఇల్లు అయితే అలా అపరిశుభ్రంగా వదిలిపెడతారా ఒక్కసారి ఆలోచించాలి. ఆరోగ్యాన్ని కాపాడే మీరు మీ హాస్పిటల్ ప్రాంగణమే ఆరోగ్యంగా కనిపించే విధంగా లేదంటే ఏ విధంలో ఉందో పరిస్థితి ఆలోచించండి. రాష్ట్ర ప్రభుత్వం వ్యాధుల నిర్మాణం కోసం పరిసరాల పరిశుభ్రత కోసం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని చేపడుతూ ఉంటే దానికి విరుద్ధంగా గండగలపాడు పల్లె దవాఖానాలో ఎలాంటి ఫ్రైడే డ్రైడే చేపట్టడం లేదని అర్థమవుతుంది. జిల్లా వైద్యులు ఒక్కసారి గండగలపాడు పల్లె దవాఖానాపై దృష్టి సారించి ప్రజలకు పారిశుధ్యం ద్వారా వ్యాధులు సంభవించకుండా దవాఖానా ప్రాంగణం మొత్తం శుభ్రపరిచి ఆసుపత్రికి వచ్చే రోగులకు ఆరోగ్య వాతావరణం కల్పించే విధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

# హిందు ధర్మ పరిరక్షణ అనే కుంటిసాకులు చెప్పడం సిగ్గుచేటు




**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్ట పట్టణ బిజెపి కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. దీని ఉద్దేశిస్తూ పట్టణ అధ్యక్షులు కర్రె ప్రవీణ్ మాట్లాడుతూ యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న అక్రమాలను వెలుగులోకి తెచ్చే ప్రయత్నంలో ఆదివారం ఆలయ ఈవో ఖండించడాని భారతీయ జనతా పార్టీ తరపున ఖండించారు. ఎందుకనగా స్వామివారి ప్రచారానికి మరియు హిందు ధర్మ పరిరక్షణ అనే కుంటిసాకులు చెప్పడం సిగ్గుచేటు. అంతలా స్వామి వారి మహిమలు, ప్రచారం చెయ్యాలని ఉంటే మన దేశంలో ఉన్న అన్ని రాష్ట్రాలలో స్వామివారి కళ్యాణము జరిపి హిందూ ధర్మ ప్రచారం చెయ్యడం. కాని జేబులు నింపుకోవడం కోసం దేవుడి పేరు చెప్పి డిఈఓ భాస్కర్ శర్మ, ఏఈఓ రఘు బాబు బృందాలు ఎన్నో సార్లు విదేశాల పర్యట చేస్తూ నాలుగు రోజుల కళ్యాణం కోసం నలభై ఐదు రోజుల పర్యటన ఎంజాయ్ చేయడానికి కాకపోతే హిందూ ధర్మ పరిరక్షణకు ఏవిదంగా ఉన్నాయేం అనే ఆలోచన ఆలయ ఉన్నతాధికారులు గమనించాలి. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి జిల్లా భానుచందర్, కార్యదర్శి పాలుగుల సురేష్, ఆవుల సత్యనారాయణ, సీనియర్ నాయకులు బెలిదే అశోక్, బందరపు మల్లేష్ గౌడ్, సుదుగు రాజిరెడ్డి, దొమ్మాట నరేష్, బోడ బుచ్చిబాబు, కర్రె లక్ష్మయ్య, శివరాత్రి శ్రీశైలం, రాపోలు నవీన్, భోగ అజయ్, కాలూరి విజయ్, శివరాత్రి వంశీ, వంగ శ్రీకాంత్, సంద ప్రవీణ్ పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టం ఆవిర్భావ శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/చండంపేట;** సమాచార హక్కు చట్టం2005 ఉపయోగించి ప్రతిసామాన్యుడికి ఏ ఆఫీసుకు వెళ్లినా పని చేయించుకోవడం, తమకు కావాల్సిన సమాచారాన్ని రాబట్టడం కష్టతరమైన నేపథ్యంలో భారత ప్రభుత్వం అక్టోబర్ 12 2005 సమాచార హక్కుచట్టం భారత దేశమంతటా అమలులోకి వచ్చిందని సమాచార హక్కు సాధన సమితి జిల్లా ఉపాధ్యక్షులు కేతావత్ రమేష్‌నాయక్ అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలనలో పారదర్శకత, ప్రజలకు జవాబుదారిగా ఉండేందుకు ఆర్టికల్ 22 ద్వారా సమాచార హక్కు చట్టం 2005ను భారత పార్లమెంట్‌లో జూన్05 2005న ఆమోదించడం జరిగిందని అక్టోబర్ 12 2005న ఈ చట్టాన్ని భారత దేశం అంతటా అమల్లోకి తీసుకొచ్చిందని తెలిపారు.

# చిన్నారులను ఆశీర్వదించిన కృష్ణారెడ్డి



**ప్రజాపక్షం/నందికొండ :** టికే ప్రకాష్ రేణుక దంపతుల ఆహ్వానం మేరకు నాగార్జునసాగర్ హిల్ కాలనీలోని రెడ్డి ఫంక్షన్ హాల్ నందు చిన్నారి భవ్య శ్రీ ,కౌశిక్ ముదిరాజ్ ల నూతన పట్టు వస్త్రలంకరణ మహోత్సవంలో టియుడబ్ల్యుజే (ఐజేయు) జిల్లా అధ్యక్షులు గార్లపాటి కృష్ణారెడ్డి,కార్యదర్శి కలిమెల నాగయ్య, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా యూనియన్ నాయకులు పిట్టల రామకృష్ణ, జిల్లా ప్రెస్ క్లబ్ కార్యదర్శి దాసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి లు పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు, ఈ కార్యక్రమంలో వారి వెంట జర్నలిస్టులు వెంకట్ రెడ్డి,నరసింహ,కనకరాజు,చందులాల్ నాయక్,విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు నేషనల్ హైవేల దిగ్బంధం

**ప్రజాపక్షం/మునుగోడు:** రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 9 ద్వారా పెంచిన బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించడానికి నిరసనగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపుమేరకు సోమవారం జరిగే నేషనల్ రహదారుల దిగ్బంధం విజయవంతం చేయాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి కృష్ణ కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే ఇవ్వడం బీసీలకు చీకటి రోజని ఇది బీసీల నోటి కాడి భూక్క ఎత్తగొట్టడమేనని వారన్నారు రిజర్వేషన్ల అంశాన్ని కోర్టులో సవాల్ చేయడం వెనక రాజకీయ పార్టీల నేతల హస్తం ఉందని అన్నారు.రిజర్వేషన్లు పెంపు తర్వాత జనరల్ బాడీ ఎలక్షన్లను నిర్వహించాలని డిమాండ్ చేశారు.



తెలంగాణ పౌరస్పందన వేదిక కవి విద్య అంతరాలు సమ్మేళనంలో నల్లగొండ జిల్లాకు చెందిన ప్రముఖ కవి రచయిత నవలాకారుడు సినీ గీతాల రచయిత భూతం ముత్యాలు రాసిన బడి పిల్లల పాట సిటీ పొట్టి బాలలు సిడి పోస్టర్‌ను మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి ఆవిష్కరించారు. ప్రజాపక్షం/నల్లగొండ

# ప్లాస్టిక్‌తో అనేక అనర్థాలు..!

**– అరికట్టడానికి స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార వర్గాలతో కమిటీలు వేయాలి.. బాధ్యతలు ఇవ్వాలి**

**ప్రజాపక్షం/పాల్వంచ :** ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టడానికి మరోమారు అధికార యంత్రాంగం కఠినంగా వ్యవహరించాలి. స్వచంద సంస్థలు, సామాజిక కార్యకర్తలు, వ్యాపార వర్గాలతో కలిపి ప్రత్యేక కమిటీలు వేసి ప్రజలకు విరివిరిగా అవగాహన కల్పించాలి. గత కొన్ని నెలల క్రితం పర్యావరణానికి హానీ కలిగించే ప్లాస్టిక్‌పై సమరం సాగించి పాల్వంచ, పాల్వంచ మండలంలో అవగాహన కల్పించి ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించారు. అధికారులు కఠినంగా వ్యవహరించారు. ప్లాస్టిక్ వ్యాపరులపై పలుమార్లు జరిమానాలు విధించారు. వ్యాపారులు, పర్యావరణ ప్రేమికులు తమ వంతు సహాయ సహకారాలు అందించారు. దీనితో పాల్వంచ మండల వ్యాపత్తంగా 95 శాతం ప్లాస్టిక్ వినియోగం తగ్గించారు. ప్రతీ షాపు యాజమాని గుడ్డ సంచులను ఇచ్చేవారు. దానికి ఖరీదు కట్టి ఇచ్చేవారు. దీనితో వినియోగదారులు ఇంటివద్ద నుండి నాణ్యమైన సంచులు తెచ్చుకోవటానికి అలవాటు పడ్డారనటంలో ఎలాంటి సందేహం లేదు. చివరకు చిన్న, చిన్న వీధి వ్యాపారాలు చేసుకొని జీవనం సాగించే వారు కూడా ప్లాస్టిక్ సంచులను కొనుగోలుదారులకు ఇవ్వాలంటే భయపడేవారు. ప్లాస్టిక్ వినియోగంపై ఓ ఉద్యమం చేశారు. ఉద్యమం అటకెక్కింది. పాల్వంచ వ్యాప్తంగా ప్లాస్టిక్ వినియోగం పెరిగిపోయింది. ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార వర్గాలు ప్లాస్టిక్ వినియోగం, విక్రయాలపై మునుపటి మాదిరిగా యుద్ధం చేస్తే గానీ వినియోగం తగ్గదని పలువురు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

### - ప్లాస్టిక్ తో అనర్థాలు...

ప్లాస్టిక్ వలన పర్యావరణం, ఆరోగ్యం, వన్య ప్రాణులకు తీవ్రమైన నష్టం జరుగుతుంది. దీని వలన డ్రైనేజీ వ్యవస్థలు మూసుకుపోతాయి.భూగర్భ జలాలు కలుషితమవుతాయి. పర్యావరణంలో కలిసి చివరకు సముద్ర జీవులకు కూడా హానీ కలుగుతుంది. ఇది భూమిలో కలిసిపడఓకుండా వేల సంవత్సరాలు ఉంటుంది. దీనితో చెట్లు బలంగా పెరగకుండా అడ్డుకొంటుంది. పంటల దిగుబడి తగ్గుతుంది. రైతులు తీవ్రంగా నష్టపోతారు. డ్రైనేజీలలో అడ్డంగా ఉండటంతో మురికి నీరు నిల్వ ఉంటుంది. దోమలకు ఆవాసాలుగా మారుతుంది. దోమల భారిన



పడిన మనుషులు పలు రోగాల భారిన పడుతూ ఆసుపత్రిలో వేలు, లక్షలు తగలేసుకొని ఆర్థికంగా నష్టపోతారు.కుటుంబాలు వీధిన పడతాయి. ఆసుపత్రులలో బిల్లు కట్టే స్థోమత లేని పేద వర్గాలు తమ ప్రాణాలు పోగొట్టుకొంటున్నారు. ప్లాస్టిక్ ఓ అద్భుతమైన రసాయన సమ్మిళితమైనది. దీనితో అనేక వస్తువులను తయారు చేస్తున్నారు. చూడగానే కొనుగోలు చేయాలనిపించే రంగు రంగులతో అందంగా ఉంటాయి. చాలా ఖరీదు తక్కువగా ఉండటంతో ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యంలోకి వచ్చింది.స్వతహాగా ప్లాస్టిక్ విషపూరితం కాదని తెలుస్తోంది. వాటి వ్యర్థ పథార్థాలతో పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లుతోంది. ప్లాస్టిక్ సంచులలో వేడి వేడి పథార్థాలు వేసి ప్యాక్ చేయటంతో వాటిలో ఉండే విషపూరితమైన పథార్థాలు ఆహార పథార్థాలలో కలిసిపోయి విషతుల్యం అవుతాయి. వీటిని తీసుకొన్న జీవ రాశులు రోగాలు భారిన పడి మృత్తువాతకు గురి అవుతున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ అధికార యంత్రాంగానికి సవాల్‌గా మారుతోంది. కావునా అధికారులు మేల్కొని ప్లాస్టిక్‌పై, దాని వలన కలిగే నష్టాలపై విరివిరిగా ప్రచారం చేయాలంటున్నారు. స్వచ్ఛంద సంస్థలు, సామాజిక కార్యకర్తలు, వ్యాపార వర్గాలతో ప్రత్యేక కమిటీలు వేసి బాధ్యత అప్పంచాలని పలువురు సూచిస్తున్నారు. దానికి సమాజంలోని ప్రతీ ఒక్కరు బాధ్యత తీసుకోవాలి. గుడ్డ సంచుల వాడకాన్ని అందుబాటులోకి తీసుకురావాలి.

### మట్టికి మానవుడు దూరం అవుతున్నాడు : గ్రీన్ ఎర్త్ సొసైటీ వ్యవస్థాపకులు



మట్టికి దూరం అవుతున్నారని దీనితోనే మానవ మనుగడకు ప్రమాదం ఏర్పాడిందని ప్లాస్టిక్ వాడకం ఎంతో ప్రమాదకరమైనదని గ్రీన్ ఎర్త్ సొసైటీ వ్యవస్థాపకులు రమేష్ రాథోడ్ ఆందోళన వ్యక్తం చేశారు. దాని మాయలో పడి ఎందరో రోగాల భారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతీ ఒక్కరికి ప్లాస్టిక్ వాడకంపై మార్పు రావాలి. ప్లాస్టిక్‌తో పర్యావరణానికి తీవ్ర ముప్పు ఏర్పడుతుందని పంటల దిగుబడి తగ్గుతుందన్నారు. దీనితో రైతాంగం ఆర్థికంగా నష్టపోతారని చెప్పారు. అధికారులు స్పంధించి ప్లాస్టిక్ వినియోగం పై ఓ యుద్ధంలా, అవగాహన సదస్సులు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకొని రావాలని కోరారు. ప్రస్తుతం మన రక్తంలో ప్లాస్టిక్ వ్యర్థాలు చేరాయని తెలుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

### ప్లాస్టిక్ వినియోగం బాగా పెరిగింది : రచ్చ శ్రీనివాస్ అల్లూరి సెంటర్




ప్లాస్టిక్ వినియోగం లేని రోజు లేకుండా జరిగిపోతున్నదని అల్లూరి సెంటర్‌కు చెందిన రచ్చ శ్రీనివాస్ అన్నారు. ఒకప్పుడు మట్టి కుండలు, స్టీలు రాగి, ఇత్తడి బిందెలలో నీరు నిలువ చేసి తాగేవాళ్ళమని అన్నారు. ప్రస్తుతం ప్లాస్టిక్ క్యాన్‌లలో నీటిని తాగుతున్నామని వాపోయారు. అవగాహన ఉన్నా ఆచరించకుండా ఇష్టారీతిని అలవాట్లతో ప్రాణాల మీదికి తెచ్చుకొంటున్నామని అన్నారు. ప్రభుత్వం రీసైక్లింగ్‌కు అవకాశం ఉన్న ప్లాస్టిక్ సంచుల తయారీకి అనుమతులు ఇవ్వాలి, లేదంటే పూర్తిగా బ్యాన్ చేయాలని కోరారు.

---

## రైతాంగం సేంద్రియ వ్యవసాయం బాట పట్టాలి : ఎమ్మెల్యే జారే

**ప్రజాపక్షం/దమ్మపేట:** రైతాంగం సేంద్రీయ వ్యవసాయం బాట పట్టాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆయిల్ ఫామ్ రైతుల ఆత్మీయ సమ్మేళనం దమ్మపేట మండలం అప్పారావుపేట గ్రామ సమీపంలో ఆదివారం జరిగింది. ఈ సమ్మేళన కార్యక్రమంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ పామాయిల్ సాగు రైతులకు బంగారు బాటగా నిలుస్తుందన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు వచ్చే పంటగా పామాయిల్ ప్రసిద్ధి చెందిందని తెలిపారు. ఆయిల్ ఫామ్ సాగులో రైతులు కొత్త పద్ధతులు నేర్చుకుంటే మరింత అధిక దిగుబడులు పొందవచ్చని సూచించారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రీయ పద్ధతులను అనుసరించడం వల్ల భూమి ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు, నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని చెప్పారు. మూడు లక్షల మెట్రిక్ టన్నుల ఫ్రూట్ బంచ్ క్రషింగ్ సాధించినందుకు ఆయిల్ ఫెడ్ అధికారులకు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పామాయిల్ రైతులతో ముఖాముఖి చర్చించి, వారి అనుభవాలను, ఆయిల్ ఫెడ్ ఉద్యోగుల సమస్యలను తెలుసుకున్నారు. తెలంగాణ దేశానికే ఆయిల్ ఫామ్ హబ్‌గా మారనున్నదని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పామాయిల్ సాగులో అధిక దిగుబడుల కోసం రైతులకు అన్ని విధాలా ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఆలపాటి ప్రసాద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## మానవతా దృక్పథంతో సామాజిక సేవ



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరులోని సుందరయ్య నగర్‌కు చెందిన కే. వెంకటరాజు పది సంవత్సరాలుగా పెరాలసిస్ వ్యాధి కారణంగా మంచానికే పరిమితమై ఉన్నారు. ఆయన అవసరాల నిమిత్తం భరోసా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అలవాల సబిత, బిట్ర సూర్యుడు, శ్వేత సహకారంతో బాధితుడికి అవసరమైన వీల్‌చైర్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవతా బాధ్యతతో ముందడుగు వేసిన ఎం. లింగబాబు (హనరబుల్ ప్రెసిడెంట్), ఎం.డి. అమీనుద్దీన్ (ప్రెసిడెంట్), శోభన్ సర్, లీలా, సబిత, లియాకత్, సురేష్, వెంకన్న, ఇతర సభ్యులు పాల్గొన్నారు. భరోసా సభ్యులు చేస్తున్న ఇలాంటి సామాజిక బాధ్యతతో కూడిన సేవా కార్యక్రమాలు సమాజానికి మార్గం చూపిస్తాయి. ప్రతి ఒక్కరూ మానవతా విలువలను ప్రోత్సహించాలి అని సంస్థ నిర్వాహకులు పేర్కొన్నారు. సంస్థ గురించి భరోసా వెల్ఫేర్ సొసైటీ అనేది స్థానికంగా పనిచేస్తున్న స్వచ్ఛంద సామాజిక సేవా సంఘం అన్నారు. రక్తదానం, ఉపాధి, ఆరోగ్య సహాయం, ఆపద్భాంధవ సేవల్లో ప్రజలకు వనరులు అందించడం ఈ సంస్థ ప్రధాన ధ్యేయం అన్నారు.

## చర్చిని ధ్వంసం చేయడం దుర్మార్గం

**-సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు**



**ప్రజాపక్షం/బోనకల్:** మండలంలోని గోవిందాపురం(ఎల్) గ్రామంలో ఇటీవల గుర్తు తెలియని వ్యక్తులు గ్రామ శివారులోని ఉన్న చర్చిని, శిలువను ధ్వంసం చేయడం దుర్మార్గమైనదని, దోషులను కఠినంగా శిక్షించాలని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదివారం ధ్వంసమైన చర్చి, శిలువను ఆయన పరిశీలించారు. పాస్టర్ కొత్తపల్లి రాంబాబును వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చర్చి, సంఘాన్ని ఏర్పాటు చేసుకొని గత నాలుగేళ్లగా ప్రార్థనలు నిర్వహించుకునే ప్రార్థన మందిరాన్ని ధ్వంసం చేయడం మానవత్వాన్ని ధ్వంసం చేయడమేనని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఆ చర్చికి సమీపంలో రూ.200 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఇంటర్నేషనల్ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణంతో గోవిందాపురం(ఎల్) గ్రామ భూములు ధరలు ఒక్కసారిగా గణనీయంగా పెరిగాయని, దీంతో రియల్టర్ల కళ్లు ఈ భూములపై పడ్డాయని తెలిపారు. చర్చిని ధ్వంసం చేసింది రియల్టర్ల పనా? లేక మరోకరా అనేది పోలీసు అధికారులు తక్షణమే నిగ్గుతేల్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. భారత రాజ్యాంగం ఇచ్చినటువంటి మతస్వేచ్ఛ హక్కుకు భంగం వాటిల్లిందని, ఏసుప్రభువు ప్రార్థన మందిరాన్ని ధ్వంసం చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఓట్ చోరీ చేసింది కాంగ్రెస్ పార్టీయే..

**బిజెపి ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్ణి వీరంరాజు**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఓట్ చోరీ జరిగింది కాంగ్రెస్ పార్టీలోనేనని బిజెపి ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్ణి వీరంరాజు అన్నారు. గత కొన్ని రోజులుగా సత్తుపల్లిలో ఓట్ చోర్ అనే కార్యక్రమం పై సంతకాల సేకరణ జరిగిందని దీనిని భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు.భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో భాజాపా కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ణి వీరంరాజు మాట్లాడుతూ గతంలో గాంధీ వారసత్వాన్ని చోరీ చేసింది ఎవరని, అప్పటి నుండి ఇప్పటివరకు కుటుంబ పాలన కుటుంబ ఆధీనంలోనే మీ కాంగ్రెస్ పార్టీ నడుస్తుందన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ కి 15ఓట్లు రాగా ప్రధానమంత్రి అవ్వాల్సి ఉంటే, ఒక్క ఓటు కూడా రాని నెహ్రూని ప్రధాని చేశారని దీనినే ఓటు చోరీ అంటారన్నారు. ఇందిరాగాంధీ ప్రభుత్వం కూలిపోతుందని ఎమర్జెన్సీ విధించి రాజ్యాంగానికి విరుద్ధంగా ప్రధాని హోదాలో ప్రజాస్వామ్యాన్ని కూలదోశారని, మరి అప్పుడు ఓటు చోరీ జరగలేదా అని ప్రశ్నించారు. తెలంగాణలో అధికారం చేపట్టిన ప్రస్తుత ముఖ్యమంత్రి ఓటుకు నోటు కేసులో ఉన్నారని, దీని ఏమంటారన్నారు. అది ఓటు చేరు కాదా అని ప్రశ్నించారు. అధికారం కోసం, పదవుల కోసం పార్టీలు మారుతూ గెలుస్తూ వస్తూ అధికారం అనుభవించే వారు గెలిస్తే ప్రజాస్వామ్యం గెలిచినట్టు, బిజెపి గెలిస్తే ప్రజాస్వామ్యం ఓడినట్లు గా మాట్లాడుతున్నారని , వీరి వ్యవహార శైలి ఆడలేక బోడి మల్లన్న అనేలా ఉందని విమర్శించారు. అనంతరం భాజపాపట్టణ అధ్యక్షుడు భానోత్ విజయ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు ఆచంట నాగస్వామి, పట్టణ ప్రధాన కార్యదర్శి మంద శివ, కార్యదర్శి జోన్ బోయిన కార్తీక్, మాజీ మండల అధ్యక్షులు పాలకొల్లు శ్రీనివాస్, పర్సా రాంబాబు, తెనాలి అశోక్ ,సాయి, మన్నేని నరసింహమూర్తి, వంశీ,మెరుగు శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

# వీడియోస్ కాలనీలో ఉద్రిక్తత

**-కాంగ్రెస్ నేత నరేందర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు**





**ప్రజాపక్షం/ఖమ్మం :** రెండు రోజులుగా ఖమ్మం 54వ డివిజన్ పరిధిలోని వీడియోస్ కాలనీలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. శని, ఆదివారాల్లో ఈ ఆందోళనలు జరిగాయి. ఈ క్రమంలో ఆదివారం కాంగ్రెస్ నాయకుడు, 54వ డివిజన్ కార్పొరేటర్ మిక్కిలినేని మంజుల భర్త నరేందర్‌ను, మంజులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే... మిక్కిలినేని నరేందర్‌పై చెరుకూరి చంద్రశేఖర్, సుజాత దంపతులు దాడి చేయించేందుకు ప్రయత్నించారని మిక్కిలినేని మంజుల ఆరోపించారు. శనివారం సాయంత్రం కొంత మంది రౌడీలు నరేందర్‌ను అడ్డగించి దాడి చేసేందుకు ప్రయత్నించారని ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆమె ఆరోపించారు. ఆదివారం ఉదయం కాంగ్రెస్ పిలుపు మేరకు ఓట్ చోరీ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళితే చెరుకూరి సుజాత అవహేళన చేసి తమను ఇష్టానుసారంగా మాట్లాడిందని మంజుల తెలిపారు. తాము ఇదేమిటని ప్రశ్నిస్తే పోలీస్ స్టేషన్‌కు తరలించారని ఆమె తెలిపారు. కాంగ్రెస్ ఎస్సి సెల్ అధ్యక్షులు రాకేష్ పై డోర్నకల్‌కు చెందిన రౌడీలు దాడి చేశారని ఆమె మీడియా సమావేశంలో తెలిపారు. ఖమ్మం పోలీసులు పట్టించుకోవడం లేదని ఖమ్మంలో ఎప్పుడు లేనివిధంగా రౌడీ ముఖలు తిరుగుతూ ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయని ఆమె ఆరోపించారు. ఇదిలా ఉండగా చెరుకూరి సుజాత, చంద్రశేఖర్‌లు కూడా మీడియా సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించి ఆ తర్వాత రద్దు చేశారు. మొత్తంగా ఒక కుటుంబ పంచాయతీ వ్యవహారమే ఈ పరిస్థితికి కారణమని తెలుస్తుంది.

## మహేందర్‌కి నామినేషన్ పత్రాలు అందించిన నూతి



**ప్రజాపక్షం/వైరా:** ఖమ్మం జిల్లా కాంగ్రేస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రేసుల్లో ఉన్న నూతి సత్యనారాయణ శనివారం ఏఐసిసి పరిశీలకులు కె.మహేందర్‌ని వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్ కొండబోలు కోటేశ్వరరావుతో కలిసి జిల్లా కాంగ్రేస్ ప్రత్యక్ష పదవికి నామినేషన్ సమర్పించారు. ఈ కార్యక్రమంలో దొబ్బల సౌజన్య, వైరా మండల అధయక్షులు నర్సిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ గంగారావు, దొడ్డా పుల్లయ్య, మచ్చా బుజ్జి, రంగా జనార్ధన్, పెద్దప్రోలు లక్ష్మయ్య, వేముల రత్నాకర్, శేఖర్‌రెడ్డి, వేల్పుల మురళి, నూతి వెంకటేశ్వరరావు, వీరభద్రం, కిసాన్ సెల్ శేఖర్ వేల్పుల, కిరణ్ పాల్గొన్నారు.

## పువ్వుల సాగుతో లాభాలు



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని పలువురు రైతులు బంతిపూల సాగుతో లాభాలు పొందుతున్నట్లు రైతులు తెలుపుతున్నారు. మండల పరిధిలోని పెద్ద కోరుకొండి, కప్పల బంధం, పాయపూర్, చిన్న కోరుకొండి, కల్లూరు తదితర గ్రామాలలో 20 ఎకరాలలో పది మంది రైతులు బంతిపూల సాగును కొనసాగిస్తున్నారు. ఒక్కో ఎకరాకు లక్ష రూపాయలు పెట్టుబడితో కొనసాగిస్తూ లాభాలను ఆర్జిస్తున్నట్లు వారు తెలుపుతున్నారు. రెండు నెలల పాటు సాగు చేసి పెంచిన తర్వాత మరో రెండు నెలలు పాటు అమ్మకాలకు పెడతారు. కేజీల ప్రకారం, క్వింటాల ప్రకారం ఎగుమతి చేసి ఇతర మండలాలకు, జిల్లాలకు ఈ ప్రాంతం నుంచి అధికంగా ప్రజలు కొనుగోలు చేసుకుని వెళ్తున్నారు. ఈ సమయంలో గత దసరా, బతుకమ్మ, స్వాముల ఇరుముడి, కార్తీక మాసం, శుభకార్యాలకు, అధిక సంఖ్యలో ఈ బంతిపూల ని ప్రత్యేక పూజలకు వాడుకలో ఉండటం వలన ఇవి వచ్చే ఫిబ్రవరి వరకు కూడా డిమాండ్ ఉంటుందని రైతులు తెలుపుతున్నారు. పెట్టుబడి తో పాటు లాభాలు కూడా వస్తాయని వారు వివరిస్తున్నారు.

# రౌడీ చర్యలను పోలీసులు పట్టించుకోరా?

**-సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్**





**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రశాంతమైన ఖమ్మం నగరంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ కొంత మంది రౌడీ చర్యలకు పాల్పడుతుంటే పోలీసులు ఎందుకు పట్టించుకోవడం లేదని సిపిఐ (ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆవుల అశోక్, జి. రామయ్య, పుల్లయ్యలు ప్రశ్నించారు. ఖమ్మం నగరంలో డోర్నకల్ ఎంఎల్ఎ అనుచరుడైన లిక్కర్ డాన్ తన గ్యాంగులను వెంటేసుకుని బెదిరింపులు, అరాచకాలు సృష్టిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని వారు ఆరోపించారు. అన్నదమ్ముల మధ్య ఆస్తి తగాదాలను పరిష్కరించే నేపంలో గంజాయి బ్యాచ్, తాగుబోతులు, రౌడీ షీటర్లు ఇండ్లలో జొరబడి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఏసిపి ఆఫీసుకు అతి సమీపంలో ఇలాంటి బెదిరింపులు జరుగుతుంటే ఎందుకు మౌనంగా పోలీసులు ఉంటున్నారని వారు ప్రశ్నించారు. ఖమ్మం పౌర సమాజం ఇటువంటి అరాచకాలను సహించదని పోలీస్ ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకుని రౌడీ చర్యలను అరికట్టాలని వారు డిమాండ్ చేశారు.

## దసరా క్రికెట్ టోర్నీలో అద్భుత ప్రదర్శన



**ప్రజాపక్షం/కరకగూడెం:** పినపాక మండలంలోని గోపాలరావుపేట గ్రామం లో దసరా పండుగ సందర్భంగా నిర్వ హించిన రెండు జిల్లాల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో పద్మాపురం గ్రామానికి చెందిన పటాన్ అతిక్ ఖాన్ అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. నాలుగు మ్యాచ్‌లలో 18 వికెట్లు తీసి బ్యాటింగ్‌లో 88 పరుగులు సాధించాడు. అతడి ప్రతిభను గుర్తించిన టోర్నీ నిర్వాహకులు “మ్యాన్ ఆఫ్ ది సీరిస్” అవార్డుతో సత్కరించి రూ. 3,016 నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా అతిక్ మాట్లాడుతూ నా ప్రదర్శనకు సహకరించిన జట్టు సభ్యులు, గ్రామస్థుల ప్రోత్సాహానికి కృతజ్ఞతలు తెలుపుతూ భవిష్యత్తులో ఇంకా మెరుగైన స్థాయిలో రాణించాలని లక్ష్యంగా పెట్టుకున్నాను అని తెలిపారు. ఈ కార్యక్రమంలో టోర్నీ నిర్వాహకులు సంతోష్, కోటి, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

# కల్లూరు మండలంలో ఖరీఫ్ వరి కోతలు ప్రారంభం



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు లో ఖరీఫ్ వరి కోతలు ఆదివారం ప్రారంభమయ్యాయి. కల్లూరు మండల పరిధిలోని ఎర్రబోయినపల్లి, వాచ్యనాయక తండా, చంద్రుపట్ల, జీడిబి పల్లి ఆయా గ్రామాలలో ఆదివారం నుంచి వరి కోతలు రైతులు ప్రారంభించారు. ఖరీఫ్ సీజన్లో 33,400 ఎకరాలు లో 21 మంది రైతులు, ఎకరాకు 25000 రూపాయలు పెట్టుబడితో ఖరీఫ్ సీజన్లో వరి పంటను సాగు చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడం వలన దళారులు కల్లాలకు ప్రవేశించి 1350 రూపాయలుకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. దిగుబడి కేఎన్ఎం 12 368 అనే వంగడం ఎకరాకు 40 బస్తాలు దిగుబడి వస్తుందని ఎర్ర బోయినపల్లి గ్రామానికి చెందిన రైతు నాగళ్ళ శ్రీనివాసరావు తెలిపారు. పంట అనుకూలంగా ఉన్న సరైన సమయంలో కొనుగోలు కేంద్రం ప్రారంభించకపోవడం వలన దళారులకు అమ్ముకోవాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. మరికొన్ని వంగడాలకు చీడ పీడల వలన దిగుబడి తగ్గుతుందని రైతులు పేర్కొంటున్నారు. ఈ విషయమై వ్యవసాయ శాఖ అధికారిని రూపాను వివరణ కోరగా మరో రెండు రోజుల్లో 35 కొనుగోలు కేంద్రాలు ప్రారంభానికి సిద్ధం చేసినట్లు తెలిపారు.

## కూసుమంచి మండలంలో సిఎస్‌సి ఉచిత ఆరోగ్య పరీక్షలు



**ప్రజాపక్షం/కూసుమంచి :** మండలంలోని ముత్యాలగూడెం, చేగొమ్మ గ్రామాలలో సిఎస్‌సి(కామన్ హెల్త్ సర్వీస్ సెంటర్) హెల్త్ కేర్ ఆధ్వర్యంలో శని, ఆదివారాలలో లేబర్ కార్డు ఇన్సూరెన్స్ కలిగిన వారికి 25వేల రూపాయల విలువ చేసే ఆరోగ్య పరీక్షలను ఉచితంగా నిర్వ హిస్తున్నారు. ఈ ఆరోగ్య పరీక్షల్లో 58 రకాల ఆరోగ్య పరీక్షలు మూడు నెలల వరకు ఉపయోగపడే విధంగా ఉంటాయని ప్రతి సంవత్సరానికి ఒక సారి నిర్వహించే ఈ వైద్య పరీక్ష లను గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలకు అత్యవసరంగా ఈ పరీక్షల ఫలితాలలో క్యాన్సర్, ఎయి డ్స్ మొదలైన జబ్బులు ఉంటే వారిని వెంటనే గుర్తించి వారికి తగిన చికిత్స చేసే విధంగా సిఎస్‌సి వైద్య పరీక్షలు తోడ్పడుతుందని బాధ్యులు తెలిపారు. ఈ ఆరోగ్య పరీక్షలలో ముందుగా లేబర్ కార్డు ఉన్న వారికి రిజిస్ట్రేషన్ చేసి అనంతరం రక్త, మూత్ర పరీక్షలు నిర్వహించి అనంతరం బార్ కోడ్ పద్ధతిలో ఆన్లైన్‌లో నిర్వహించి సమాచారం అందించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈకార్యక్రమంలో సిఎస్‌సి క్యాంప్ కోఆర్డినేటర్ అశోక్, సభ్యులు సాయి తేజ, శ్రీలత, జిలాని, రాజు, మణికంత, గణేష్ పాల్గొన్నారు. ఇప్పటి వరకు చేగొమ్మ, ముత్యాలగూడెం గ్రామాలలో సుమారు రెండు వందల మందికి ఈ పరీక్షలు నిర్వహించినట్టు తెలిపారు.

# మురుగునీటితో దుర్వాసన

**నీటిని తొలగించాలని వేడుకుంటున్న స్థానికులు**



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరులోని కొత్త బస్టాండ్ ఎదురుగా జాన్డీర్ ట్రాక్టర్ షోరూమ్ పక్కన బజారు లో గృహాల మధ్య నీరు నిలవబడి మురుగుగా మారి, ఈగలు, దోమలు, పందులు, పశువులు కు ఆవాసంగా మారి దుర్వాసన కొడుతుంది. దీనివలన సమీపంలోని గృహస్తులు నానా ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్ని రోజులుగా సంబంధిత అధికారికి తెలియపరచినా స్పందన లేదని పరిసర గృహస్తులు తెలుపుతున్నారు. మున్సిపాలిటీ అధికారులు పట్టించుకోకపోవడం వలన దుర్వాసనతో, దుర్గంధంతో దోమలు పెరుగుదల వలన మురుగు పెరగటం వలన దోమలకు నిలయంగా ఉండటం వలన పందులకు ఆవాసంగా ఉండటం పశువులకు సేదదీరేందుకు అనుకూలంగా ఉండటంతో నివాస గృహాల మధ్య మురుగుగుంట ఉండటంతో ఇబ్బందులు ఆ విధంగా గృహాల మధ్య ఉండటం వలన వ్యాధులు వచ్చే అవకాశం ఉందని వైద్యులు సూచిస్తున్నారు. ఈ విషయమై గృహస్తులు మునిసిపాలిటీ మేనేజర్ కు కమిషనర్ కు ఫిర్యాదు అందజేశామని తెలిపారు. మేనేజర్ నాగేశ్వరరావును వివరణ కోరగా ఖాళీ స్థలాల అందరికీ తగు చర్య నిమిత్తం నోటీసులు అందజేశామని రెండు మూడు రోజుల్లో సమస్య పరిష్కారంఅవుతుందని తెలిపారు.